సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 3 । జనవరి । 2024



అమూల్ పాల సేకరణ 90 శాతం జరగాలి

అమూల్‌కు పాల సేకరణ 90శాతం జరిగేలా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. - 8లో



అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె కమ్మవీధికి చెందిన కాలేషా కుమారుడు ఎం.ఎస్.దావూద్(39) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను పాలకోవా వ్యాపారం చేసేవాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 106 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	480	482
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 96.120 కిలోలు

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



డీడీగా బాధ్యతలు స్వీకరించిన విశ్వేశ్వరరెడ్డి

మదనపల్లె : మదనపల్లె పశుసంవర్ధకశాఖ ఎఫ్ ఏసీ డిప్యూటీ డైరెక్టర్‌గా విశ్వేశ్వరరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీడీగా పనిచేస్తున్న కె.రంగయ్య వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. దీంతో ఏడీగా పనిచేస్తున్న విశ్వేశ్వరరెడ్డిని ఎఫ్ఏసీ డీడీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని 12 మండలాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 32వ విడత జాతీయ గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ యూఎస్‌ఏ కో-కన్వీనర్‌గా చిల్లా కిరణ్



కిరణ్

రాజంపేట : రైల్వేకోడూరు మండలంలోని వెంకటరెడ్డిపల్లెకు చెందిన చిల్లా కిరణ్ వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా యూఎస్ఏ కో-కన్వీనరుగా నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులందాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఈయన పార్టీ ఎన్ఆర్ఐ వింగ్‌లో కొన్నేళ్లుగా కొనసాగుతున్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తన తండ్రి చిల్లా గురివిరెడ్డి వైఎస్సార్ కుటుంబానికి విధేయుడన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, సోషల్‌మీడియా కో-ఆర్డినేటర్ సజ్జల భార్గవరెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనువాసులు, ఉత్తర అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్‌లకు కృతజ్ఞతలను తెలియచేశాడు.

ఎయిర్‌పోర్టులో స్నాక్‌బార్



కడప సిటీ : కడప ఎయిర్‌పోర్టులో ఎస్‌పీ ఎంటర్‌ప్రైజెస్ పేరిట స్నాక్ బార్‌ను సోమవారం రాత్రి డైరెక్టర్ సుజిత్‌కుమార్ పొద్దర్ ప్రారంభించారు. ట్రూజెట్ విమాన సంస్థ ఉన్న సమయంలో ఇక్కడ స్నాక్ బార్ ఉండేది. అటు తర్వాత లేకపోవడంతో ప్రయాణికులు నగరం నుంచి స్నాక్స్ తీసుకెళ్లేవారు. కడప విమానాశ్రయం నుంచి ఇండిగో విమానయాన సంస్థ ప్రస్తుతం విమానాలు నడుపుతోంది. రెండో సంవత్సరంలోకి ఈ సంస్థ అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో ఇక్కడ స్నాక్ బార్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండటంతో కడప ఎయిర్‌పోర్టు డైరెక్టర్ స్పందించి తగిన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు అధికారులు జోసెఫ్, ఇండిగో విమానయాన సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ పరవళ్లు

- బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి
- ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీలకు ప్రత్యేక గౌరవం
- సామాజిక సాధికారతను చేతల్లో చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- నేడు రైల్వేకోడూరులో సామాజిక సాధికార బస్సు యాత్ర



సాక్షి రాయచోటి : పేదల ఇంటి తలుపుతట్టి సంక్షేమాన్ని అందించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పది అడుగులు ముందుకేసింది. అట్టడుగు వర్గాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు విప్లవాత్మక చర్యలే చేపట్టింది. రాజ్యాధికారం, సామాజిక న్యాయం ఇదివరకు పాలకులు మాటల్లోనే చెప్పేవారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆచరణలో చూపెట్టింది. సిఫార్సులతో నిమిత్తం లేకుండా అర్హతే ప్రామాణికంగా పేదల గడపలకు సంక్షేమం పరుగులు తీస్తోంది. సామాజిక న్యాయం పాటిస్తూ రాజకీయ ఉన్నతికి సైతం పేద వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రాజకీయ పార్టీలలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనని కరుడుగట్టిన కమ్యూనిస్టులు సైతం సామాజిక న్యాయం అమలు చేస్తున్న తీరును చూసి ఆశ్చర్యపోతున్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో సామాజిక న్యాయం జరుగుతుందని ఆయా వర్గాలు భావిస్తున్నాయి.

బలహీన వర్గాలకు పట్టం

రాష్ట్రంతోపాటు అన్నమయ్య జిల్లాలోనూ బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టం కట్టారు. రాజకీయంగానూ, ఆర్థికంగానూ వారి ఎదుగుదలకు విశేషంగా కృషి చేస్తున్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల సంక్షేమానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా పెద్ద ఎత్తున ప్రయోజనాన్ని అందిస్తున్నారు. అంతేకాకుండా ఆయా వర్గాలకు సమాజంలో సమున్నత గౌరవ లభించేలా ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుండడంతో ఆయా వర్గాలు ప్రభుత్వ తీరును కొనియాడుతున్నాయి.

రైల్వేకోడూరులో బడుగులకు భారీ ప్రయోజనం

అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గానికి సంబంధించి బడుగులకు భారీ ప్రయోజనాన్ని ప్రభుత్వం అందించింది. రాష్ట్ర ప్రభుత్వం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కాపులకు సంబంధించి డీబీటీ ద్వారా రూ. 995 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 297 కోట్లు కలిపి దాదాపుగా రూ.1292 కోట్లకు పైగా ప్రయోజనాన్ని అందించింది. బీసీలకు సంబంధించి డీబీటీ ద్వారా రూ. 300 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 99 కోట్లు, ఎస్సీలకు సంబంధించి డీబీటీ ద్వారా రూ. 213 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 73 కోట్లు, ఎస్టీలకు సంబంధించి డీబీటీ ద్వారా రూ. 54 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 20 కోట్ల సొమ్ము అర్హులకు అందింది. అలాగే మైనార్టీలకు సంబంధించి డీబీటీ ద్వారా రూ. 15 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 5 కోట్లతోపాటు కాపులు, ఓసీల్లోని పేద వర్గాలను కలుపుకుని భారీ ఎత్తున ప్రభుత్వం అందించింది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా వర్గాలకు పెద్ద ఎత్తున ఊహించని ప్రయోజనాన్ని అందించారు.

పదవుల్లోనూ అగ్రస్థానం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ ఎస్టీ,బీసీ, మైనార్టీలతోపాటు కాపు వర్గాలకు రాజకీయ పదవులతోపాటు ఇతర పలు పదవులను కట్టబెట్టారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎస్సీ మహిళకు సంబంధించి సినిమా ఫొటోగ్రఫీ డైరెక్టర్ మొదలుకొని వక్ఫ్‌బోర్డు, ఎస్సీ కార్పొరేషన్, రాష్ట్ర టూరిజం డైరెక్టర్లు, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్, ముదిరాజ్ కార్పొరేషన్ ఇలా చెబుతూపోతే అనేక రంగాలలో పెద్దపెద్ద పదవులను అణగారిన వర్గాలకు అప్పగించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పలువురు కొనియాడుతున్నారు. అలాగే నియోజకవర్గంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ పదవుల్లోనూ ఎస్సీ,బీసీ వర్గాలే కీలకంగా ఉన్నాయి.

బీసీ ఓట్ల కోసం టీడీపీ పన్నాగం

గతంలో తెలుగుదేశం పార్టీ చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకుందని విశ్లేషకుల అభిప్రాయం. ఆ పార్టీ బీసీల పట్ల యూజ్ అండ్ త్రో పాలసీ అమలు చేసిందని రాజకీయ విశ్లేషకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఓటుబ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వడం, తర్వాత రాజకీయాలకు వాడుకుని వదిలివేయడం పరిపాటిగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. సంక్షేమంలో సమున్నత స్థానం కల్పించడంలో టీడీపీ విఫలమైందని భావన ఆయా వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు అన్ని రకాలుగా అగ్రపీఠం దక్కడం విశేషం

సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయండి

– ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరులో బుధవారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను, సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. యాత్ర, సభ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్సు యాత్ర మధ్యాహ్నం 12 గంటలకు రాజ్‌కన్వెన్షన్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులలో యాత్ర నిర్వహించి టోల్‌గేట్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి సభ మొదలవుతుందన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి, ప్రముఖ నటుడు ఆలీ, ఎంపీ నందిగామ సురేష్, ఎమ్మెల్సీ సురేష్, కడప మేయర్ సురేష్‌బాబు, ఎస్టీ కమీషన్ చైర్మన్ కుంబారవి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు , నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎక్జుక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, జెడ్పీటీసీ రత్నమ్మ, సుధాకర్‌రాజు, శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, బండారు మల్లికార్జున, సిద్దు, రాజారెడ్డి పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

కార్పొరేట్‌ను తలదన్నేలా వంద పడకల ఆసుపత్రి

- ఈనెల 6న ప్రారంభానికి ఏర్పాట్లు
- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వెల్లడి



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటిలో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేల ఉందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు వేగంగా సాగాలని, ప్రారంభానికి కావాల్సిన ఏర్పాట్లు అన్నీ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి నియోజక వర్గ పరిధిలోని 9 మండలాలకు చెందిన పేద ప్రజలకు ఏరియా ఆసుపత్రి నుంచి వైద్యం అందుతోందని తెలిపారు. ఈ 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలంటూ దశాబ్ద కాలంగా రాజకీయంగా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేశామన్నారు. అయినా గత ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన లేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిధులు కేటాయించడంతో రాయచోటి నియోజక వర్గ ప్రజల కల నెరవేరిందన్నారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. వేగంగా పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకొన్నామన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచనలు చేయడంతో మొదటి, రెండవ, మూడవ అంతస్తుల భవనాలు నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధం అవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఆసుపత్రి ఆవరణలో పచ్చదనం పెంచేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అందుబాటులోకి మెరుగైన వైద్యసేవలు

వంద పడకల ఆసుపత్రిగా మారిన తరువాత మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. 50 పడకల ఆసుపత్రిగా ఉన్నప్పుడే కోవిడ్ సమయంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే మూడు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, 10 ఐసీయూ బెడ్లు, అనస్థీషియా వర్క్‌స్టేషన్లు, విశాలమైన ఓపీ గదులు ఏర్పాటు చేశామన్నారు. అన్ని విభాగాలకు తోడుగా కంటి, ఈఎన్‌టీ విభాలు కూడా ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. అలాగే డయాలసిస్ సేవలు కూడా మరింత విస్తృతమవుతాయన్నారు. ఇంతవరకు 500 నుంచి 700 మధ్య ఉన్న ఓపీ ఇకపై 1200 – 1500కు పెరిగినా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. 26 మంది వైద్యాధికారులు, 73 మంది వైద్య సిబ్బందిని నియమించామని చెప్పారు. అన్ని వసతులతో నిర్మాణం పూర్తి చేసుకుంటున్న ఈ ఆసుపత్రిని ఈ నెల 6న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి కమిటీ సభ్యుడు బేపారి మహమ్మద్ ఖాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, వైద్యాధికారులు బండారు కిరణ్‌కుమార్, మహేశ్వర రాజు, రెడ్డి భాస్కర్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్, ఖదీర్ తదితులు పాల్గొన్నారు.

8న హాజరు కావాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : 2023–24 సంవత్సరానికి అప్రెంటీస్‌షిప్‌కు ఎంపికైన వైఎస్సార్ జిల్లా అభ్యర్థులు ఈనెల 8వ తేదీన కర్నూలులోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ లో ఉదయం 9.00 గంటలకు హాజరు కావాలని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నజీర్ అహ్మద్ తెలిపారు. తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, ఐటీఐ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రాలు, బ్యాంకు అకౌంటు పాస్ పుస్తకం, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్‌కార్డుల మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో రావాలన్నారు. అప్రెంటీస్‌షిప్‌కు ఎంపికైనవారి సీరియల్ నంబర్లు ఇలా ఉన్నాయి.

డీజిల్ మెకానిక్స్ – 189, 67, 164, 158, 185, 22, 32, 183, 210, 139, 104, 78, 151, 176, 204, 252, 148, 10, 196, 216, 130, 6, 53, 193, 63, 92, 76, 212, 108, 179, 194, 195, 161, 87, 137, 88, 165, 192, 95, 186, 177, 18, 56, 25, 33, 198. **మోటారు మెకానిక్** – 37, 23, 29, 20, 8, 43, 50, 38, **ఎలక్ట్రీషియన్** – 3, 56, 30, 59 **వెల్డర్** – 1, **మిషనిస్టు** – 3, 20, **ఫిట్టర్** – 8, 26, **డ్రాఫ్ట్‌స్‌మెన్ (సివిల్)** – 24,15

బడి.. కొత్త ఒరవడి

బడి బాగుంటేనే పేదోడి బతుకు బాగుపడుతుందని నమ్మిన సీఎం వైఎస్ జగన్ దానిని మనసా వాచా కర్మణ అమలు చేశారు. అమ్మ ఒడి మొదలుకుని.. నాడు..నేడు.. గోరుముద్ద.. విద్యా కానుక.. వసతి దీవెన.. విద్యా దీవెన.. వంటి అనేక పథకాలకు శ్రీకారం చుట్టారు. చరిత్రలో ఎన్నడూ లేని.. ఎవరూ చేయని విధంగా విద్యా విప్లవానికి నాంది పలికారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన విద్యా సంస్కరణలపై ప్రత్యేక కథనం.

- పేదల విద్యకు ప్రాధాన్యం
- నాడు-నేడుతో సుందరంగా పాఠశాలలు
- కార్పొరేట్ స్థాయిలో వసతులు
- డిజిటల్ తరగతులతో విద్యాభివృద్ధి



కార్పొరేట్‌కు ధీటుగా ఉన్న ముదివేడు ప్రభుత్వ పాఠశాల

అమ్మ ఒడి 2023-24
1,52,363 మంది
22,854,90,00 కోట్లు



నాడు-నేడు రెండో దశ పాఠశాలలు 1037



జగనన్న విద్యాకానుక
1,54,789 మంది,
13,64,367 కోట్లు





ట్యాబ్‌లు 19,279

డిజిటల్ విద్య మొదటిదశ పాఠశాలలు : 164



మదనపల్లె సిటీ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా పేద పిల్లల భవితకు బంగారు బాటలు పరిచారు. జిల్లాలో 1,709ప్రాథమిక, 214ప్రాథమికోన్నత,296 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 1,54,789 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2023లో ప్రభుత్వ,ప్రైవేటు బడుల్లో విద్యార్థులకు సంబంధించి అమ్మ ఒడి పథకం కింద 1,52,363 మంది తల్లులకు 228,54,90,00 కోట్లు ఆర్థిక సాయాన్ని అందించారు.

అమ్మచేతికి గోరుముద్దలా...

విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. రోజుకో మెనూ అమలు చేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. 80 శాతానికి పైగా విద్యార్థులు భోజనాన్ని తీసుకుంటున్నారు. జిల్లాలో 2190 పాఠశాలల్లో 1,44,467 మంది మధ్యాహ్నభోజనం తింటుండగా ప్రభుత్వం 2022–23 సంవత్సరానికి 20కోట్లు వెచ్చించింది.

విద్యాకానుక.. ప్రగతికి వీచిక

పాఠశాలల్లో డ్రాపౌట్స్‌ను తగ్గించి స్థూల నమోదు నిష్పత్తిని మెరుగుపరచడం, అభ్యాసనా కార్యకలాపాల్లో విద్యార్థుల భాగస్వామ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం జగనన్న విద్యాకానుక కిట్లను అందిస్తోంది. బ్యాగులు 1,54,789, యూనిఫాం 1,54,789 మందికి అందించారు. డిక్షనరీలు 17,750 మంది అందజేశారు. ఇందు కోసం 13,64,367 కోట్లు ఖర్చు పెట్టడం విశేషం.

జగనన్న విద్యాదీవెనలు

ఆర్థికపరమైన ఇబ్బందులతో పేద విద్యార్థులు మధ్యలో చదువులు ఆపకుండా జగనన్న విద్యాదీవెన కింద 10 మంది విద్యార్థులకు రూ.92.91 లక్షలు అందజేశారు. జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాల ద్వారా ప్రభుత్వం సాయం అందిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం కింద అందించారు.

డిజిటల్ తరగతులు

దృశ్య, శ్రవణ విద్య ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపడుతుందన్న ఉద్దేశంతో ఎనిమిదో తరగతి నుంచి డిజిటల్ విద్యను ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఇందు కోసం మొదటి విడత ఐఎఫ్‌సీ ప్యానల్స్ 164 పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 17,750 మందికి అందజేశారు. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్, స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను అందిస్తున్నారు. ఇటీవలే 19279 ట్యాబ్‌లు అందజేశారు.

ఫలితం పదిలం కావాలని

జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో గతేడాది 72.05 శాతం నమోదైంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఇష్టంగా వెళుతున్నారు



నా ఇద్దరు పిల్లలు మా గ్రామంలోని సర్కారు బడికి వెళుతున్నారు. అసలు మన ఊరి స్కూలేనా ఇది అనిపిస్తుంది. అక్కడికి వెళ్లి చూస్తే పిల్లలకు కావాల్సిన విద్యాసామగ్రి ఉచితంగా ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం మా ఇంటి కంటే బాగుంటుంది. మంచి యూనిఫాం వేసుకుని మా బిడ్డలు మా ఊర్లో స్కూల్‌కు ఎంతో ఇష్టంగా వెళ్తున్నారు. – షేక్ నసీమా, చింతపర్తి, వాల్మీకిపురం మండలం.

నాణ్యతగా కలెక్టర్ బంగ్లా నిర్మాణం

రాయచోటి: జిల్లా కేంద్రంలో చేపట్టిన కలెక్టర్ బంగ్లా నిర్మాణం నాణ్యతలో ఎలాంటి రాజీపడరాదని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ వెనుకవైపున జరుగుతున్న కలెక్టర్ బంగ్లా నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు.

అమూల్ పాల సేకరణ 90 శాతం జరగాలి

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- ప్రభుత్వ ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలి: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



పాల ఉత్పత్తులపై అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, పక్కన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి : పాడి రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకొని అమూల్‌కు పాల సేకరణ 90శాతం జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితో కలిసి కలెక్టర్ జిల్లాలోని పాల సేకరణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాల సేకరణ కోసం అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో జగనన్న పాలవెల్లువ ప్రాముఖ్యతను పాడి రైతులకు తెలియజేసి అమూల్‌కు పాలు పోసే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ప్రోత్సాహకాలపై పాడి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. గాలివీడు మండలంలో గోరాన్ చెరువు, సంబేపల్లె మండలంలో దేవపట్ల, శెట్టిపల్లె, రాయచోటి మండలంలో గొర్లముదివేడు గ్రామాలలో వెంటనే బీఎంసీలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో ఒక బీఎంసీయూ తప్పక ఉండేలా చూడాలన్నారు. రాయచోటి మండలంలో ఏకిలవంకపల్లె గ్రామంలో బీఎంసీయు నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్, జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం, గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పశుసంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించని బీఎల్‌ఓలపై చర్యలు

స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనే ధ్యేయంగా ముసాయిదా ఓటరు జాబితాలోని తప్పొప్పులను పూర్తిగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ నియోజకవర్గ ఈఆర్‌ఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. ఇందులో భాగంగా బాధ్యతగా విధులు నిర్వహించని బీఎల్‌ఓలపై చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి అన్నమయ్య జిల్లాకు సంబంధించి తుది ఓటరు జాబితా రూపకల్పన, రెవెన్యూ అంశాలపై నియోజకవర్గ ఈఆర్‌ఓలు, తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎస్‌ఈ, డీఎస్‌ఈ అంశంలో 7,15, 30 రోజులు పైబడిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాలలో ఫామ్ 6లో వచ్చిన దరఖాస్తులు, పరిష్కారం, పెండింగ్‌లపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు చేశారు. జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలను వెంటనే రూపొందించాలన్నారు. బీఎల్‌ఓల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఎన్నికల సంసిద్ధతలో భాగంగా ఆయా అంశాలపై సంబంధించి మాస్టర్ ట్రైనర్లతో శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అసైన్మెంట్ భూముల రీ వెరిఫికేషన్ కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చుక్కల భూములు, ఇనామ్ భూముల అంశంలో మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి నియోజకవర్గ ఈఆర్‌ఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్రెంటీస్‌కు అభ్యర్థుల ఎంపిక

రాయచోటి అర్బన్ : జిల్లాలో 2023 -24 ఏడాదికి ఆర్టీసీ అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల, కర్నూలు ప్రిన్సిపల్ ఎస్.నజీర్ అహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో 3,13, 21, 38, 49, 51, 62, 64,67,79, 97 101,107,100,101,106,107, 110, 111, 112, 113, 114, 115, 116 సీరియల్ నంబర్లవారు ఎంపికయ్యారన్నారు. ఎలక్ట్రిషియన్ ట్రేడ్‌లో 47, 86, 101, డ్రాఫ్ట్ మన్‌లో 12 సీరియల్ నంబర్ల వారు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అన్ని రకాల ధ్రువపత్రాలతో ఈనెల 9వ తేదీ కర్నూలులోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు.

గోవుకు అంత్యక్రియలు

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లి గ్రామ పంచాయతీ మోదీన్‌సాబ్‌పల్లి గ్రామంలో ఉన్న శ్రీ నరసింహస్వామి గోశాలలోని గోవు అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ గోవుకు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించామని గోశాల నిర్వాహకుడు లక్ష్మీనరసింహ స్వామి తెలిపారు.

యాసిడ్ తాగిన వ్యక్తికి అస్వస్థత

మదనపల్లె: బాటిల్‌లో ఉన్న యాసిడ్‌ను తాగేనీరుగా భావించి పొరబాటున తాగిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు లోనైన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మకాలనీకి చెందిన ఆర్.కె.స్వామి కుమారుడు బాలాజీ (50) ఉదయం ఇంట్లో బాటిల్‌లో ఉన్న యాసిడ్‌ను తాగేనీరుగా భావించి పొరపాటున తాగాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు లోనుకాగా గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. అయినా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి సిఫార్సు చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలో జరిగింది. కమ్మగడ్డవీధికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు కె.ఎస్.బాబు(32) కుటుంబ సమస్యల కారణంగా మద్యంలో నిద్రమాత్రలు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు. టు టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఎం.ఎస్.దావూద్

మదనపల్లె : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. కమ్మవీధికి చెందిన కాలేషా కుమారుడు ఎం.ఎస్.దావూద్(39) పాలకోవా వ్యాపారంతోపాటు నెలవారీ చిట్టీలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. వ్యాపార నిర్వహణలో భాగంగా పలుచోట్ల అప్పులు చేయడంతో భారం పెరిగింది. ఈ క్రమంలో మద్యం, ఇతర వ్యసనాలకు బానిసయ్యాడు. ఇంట్లో తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో మానసిక ఆందోళనకు లోనై పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. సోమవారం రాత్రి భార్య సమియాతో గొడవపడ్డాడు. దీంతో ఆమె సోదరుని ఇంటికి వెళ్లింది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేకపోవడంతో నిద్రమాత్రలు మింగి దావూద్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స విభాగంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం కోసం రెండో రోజు గాలింపు



చెరువులో మృతదేహం కోసం గాలిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం కోసం రెండోరోజు మంగళవారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక దళితవాడకు చెందిన గంగాధర్ (23) సోమవారం చేపలు పట్టేందుకు సమీపంలోనే ఉన్న తిప్పరాయ చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైన విషయం విదితమే. మృతదేహం కోసం ములకలచెరువు ఫైర్ అధికారులు రెస్క్యూటీంతో మంగళవారం గాలించినా ఫలితం లేదు. పురాతన కాలం నాటి పాతాళభైరవి ఇనుప చువ్వలతో కూడా ప్రయత్నించారు. సర్పంచ్ తమక శంకర్ కర్ణాటక రాష్ట్రం నుంచి నీటి లోపల మృతదేహం ఆచూకీ తెలియజేసే కెమెరాలను తెప్పించారు. వాటిని నీటి లోపల వదలగా మృతదేహం ఉన్న స్థలం గుర్తించే సమయానికి బ్యాటరీ చార్జింగ్ అయిపోవడంతో ఆ ప్రయత్నం విఫలమైంది. తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్‌ఐ రవీంద్రబాబులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహం వెలికి తీసే చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

ఇంటిపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళ వీధిలో నివాసం ఉంటున్న రవికుమార్ (45) ఈనెల 1వ తేదీన తాను నివాసం ఉంటున్న ఇంటిపై నుంచి జారిపడి మృతి చెందాడు. రోజు మాదిరిగానే హమాలీ పనిచేసుకుని ఇంటికి మధ్యాహ్నం మద్యం తాగి వచ్చాడు. తాను అద్దెకు ఉంటున్న ఇల్లు రెండవ అంతస్తులో ఉండటంతో, అక్కడున్న పిట్టగోడ నుంచి జారి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి.

చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య అరుణ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కడప టూటౌన్ ఎస్‌ఐ సంజీవరాయుడు కేసు నమోదు చేశారు.

రోగులందరికీ వైద్య సేవలు అందించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు



జగనన్న ఆరోగ్య సురక్షలో మందుల పంపిణీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

సిద్దవటం : రోగులందరికీ వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలం బొగ్గిడివారిపల్లె గ్రామంలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలకు వచ్చిన వారి వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండవ విడత జరుగుతున్న ఈ కార్యక్రమంలో రోగుల సంఖ్య పెరిగే విధంగా కృషి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ కన్వీనర్ శోభన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ప్రకటన

ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల

క్రిష్ణంపల్లె - 516175, దువ్వూరు, వై.యస్.ఆర్.కడప జిల్లా

ఆంధ్రప్రదేశ్ గౌరవ ఉన్నత న్యాయస్థానం సిసి నెంబరు 1114/2022 ఇన్ డబ్ల్యు.పి.నెం.1227/2014 నందు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారము జిల్లా విద్యాశాఖాధికారి గారు అనుమతి మంజూరు చేసినారు కావున పై ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ క్రింద తెలుపబడిన ఎయిడెడ్ ఉద్యోగముల కొరకు విద్యార్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను 03.01.2024వ తేది నుండి 09.01.2024 వరకు ఆహ్వానించడమైనది. అభ్యర్థులు తమ దరఖాస్తులను 09.01.2024వ తేది సాయంత్రం 5.00 గంటల లోపల పాఠశాల కరస్పాండెంట్ గారికి నేరుగా గాని పోస్టు ద్వారా కాని పంపవలయును. అభ్యర్థి తమ విద్యార్హతలకు సంబంధించి వ్యక్తిగత వివరములు 2 పాస్‌పోర్ట్ ఫోటోలు మరియు విద్యార్హత నకళ్లను గెజిటెడ్ అధికారిచే ధృవీకరించి (Attestation) దరఖాస్తుకు జత చేయవలయును.

Name of The Post	No. of Vacancy	Roster Point	TET
Secondary Grade Teacher	04	BC-A-1 OC-2 SC-1	పాస్‌అయిన అభ్యర్థులకు మాత్రమే
Hindi Pandit Grade-1	01	OC Single Solitary	

కరస్పాండెంట్

రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడి మృతి



సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని యువకుడు (30) రైలు కిందపడి మృతి చెందాడని కడప రైల్వే ఎస్‌ఐ రామరాజు తెలిపారు. తెల్లవారుజామున తిరుపతి వైపు వెళ్లే రైలుకింద పడి మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. ఇది ఆత్మ హత్యా లేదా ప్రమాదవశాత్తు మృతి చెందాడా అనేది తెలియాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించామన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న 'ఆడుదాం ఆంధ్ర'



'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' మెగా క్రీడా టోర్నమెంట్ జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. డిసెంబర్ 26న ప్రారంభమైన ఈ క్రీడాపోటీల్లో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో గ్రామ/వార్డు సచివాలయ స్థాయిల్లో పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. సచివాలయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికీ క్రీడాదుస్తులు పంపిణీ చేయడంతో మంగళవారం నిర్వహించిన పోటీలు క్రీడాదుస్తులతో మరింత ఆకర్షణీయంగా సాగాయి. జిల్లాలోని పలు మండలాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు నిర్వహించగా, ఎంపీడీఓలు, ఫిజికల్ డైరెక్టర్లు పోటీలను పర్యవేక్షించారు.

సాహస యాత్రికులకు అభినందన



సాహస యాత్రికులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : హిమాచల్ ప్రదేశ్‌లో డిసెంబర్ 10 నుంచి 28 వరకూ వివిధ సాహస రంగాలలో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకొని తిరిగివచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వైవీయూ అధికారులు అభినందించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి, క్యాంపు కంటింజెంట్ డా. కె.శ్రీనివాసరావుతో కలిసి వలంటీర్లు వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీసీ క్యాంపు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంబీఏ విభాగం నుంచి వెంకట సుబ్రహ్మణ్యం, మనీష, ఎంసీఏ నుంచి మానస, జగదీష్ , జువాలజీ నుంచి శ్రావణి, బాబా ఫైరోజ్ లు స్పందిస్తూ హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారి వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ మౌంట్ నీరింగ్ అండ్ అల్లైడ్ స్పోర్ట్స్ మనాలిలో వివిధ రంగాల్లో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్నామన్నారు. తమతోపాటూ వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుండి త్రివేణి, అశోక్, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ నుండి అఖిల్, భవిత రాయ్ ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి సాహసయాత్రలో పాల్గొన్న విద్యార్థులను, కంటింజెంట్ లీడర్ డాక్టర్ కె.శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా. ఎస్.పి. వెంకటరమణ,డా.టి.చంద్రశేఖర్, డా. గంగయ్య పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మించడం ద్వారా పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆందోళన సందర్భంగా ప్రభుత్వం నమోదు చేసిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి జిల్లా కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. అప్పట్లో ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన నంద్యాలకు చెందిన బొజ్జా దశరథరామిరెడ్డిని మంగళవారం అరెస్టు చేయడం బాధాకరమన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఆటో బోల్తాపడిన ఘటనలో గాయపడిన లలితమ్మ

మదనపల్లె : ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొని బోల్తా పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. రామసముద్రం మండలం మట్లవారిపల్లెకు చెందిన జవన్న కుమారుడు ఎం.భార్గవ (30) వ్యక్తిగత పనులు పూర్తి చేసుకుని ద్విచక్రవాహనంలో నడింపల్లి నుంచి మట్లవారిపల్లెకు బయలుదేరాడు. మార్గ మధ్యంలోని తిరుమలరెడ్డిపల్లె మారెమ్మగుడి వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో భార్గవతో పాటు ఆటోలోని జంగాలపల్లెకు చెందిన తిమ్మయ్య భార్య ఓం శక్తిమాల భక్తురాలు లలితమ్మ(30 తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను వెంటనే రామసముద్రం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. రామసముద్రం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



మృతి చెందిన అనిమేష్

వల్లూరు : మండల కేంద్రమైన వల్లూరులో మంగళవారం అనిమేష్ (16) అనే బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని కొప్పోలు ఎస్సీ కాలనీకి చెందిన క్రిష్ణ కుమారుడు అనిమేష్ సోమవారం సాయంత్రం కడపకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాలేదు. కాగా మంగళవారం వల్లూరులోని ఈద్గా సమీపంలో గల పొలాల్లో ఉన్న వేప చెట్టుకు ఒక బాలుడు ఉరి వేసుకుని మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో క్రిష్ణయ్య అక్కడికి చేరుకుని మృతుడు తన కుమారుడు అనిమేష్‌గా గుర్తించారు. కమలాపురం సీఐ రామ క్రిష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా తన కుమారుడి మృతిపై తనకు అనుమానాలు వున్నాయని మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మోహన్ రావు తెలిపారు.

పేట్రేగిపోయిన అల్లరి మూకలు

- బీరు సీసాలు, కత్తులతో స్వైర విహారం
- ఇరువురికి తీవ్ర గాయాలు



సంఘటనను గురించి తెలుసుకుంటున్న పోలీసులు

చెన్నూరు : చెన్నూరు గాంధీ నగర్‌లో గంజాయి, మద్యం మత్తులో అల్లరిమూకలు పేట్రేగిపోయారు. బీరు బాటిళ్లు, కత్తులతో పరస్పరం దాడి చేసుకోవడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. మంగళవారం సాయంత్రం కొంతమంది యువకులు చెన్నూరు చర్చి ప్రాంతంలో మద్యం సేవించారు. ఇదే సమయంలో ఇరువర్గాలుగా విడిపోయి బీరు సీసాలు, కత్తులతో దాడులు చేసుకున్నారు. అంతేకాకుండా గ్రామంలో కత్తులు పట్టుకొని తిరగడంతో జనం భయభ్రాంతులయ్యారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో అల్లరిమూకలు తిష్టవేసి అరాచకం సృష్టిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ చిన్న పెద్దయ్య మాట్లాడుతూ గొడవలకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అయితే వారికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

వైవీయూలో సీఎంసీ ప్రారంభం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ కాన్ఫరెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎంసీ)లో అందుబాటులో ఉంటుందని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. వైవీయూ ఐటీశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ‹కాన్ఫరెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం›ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నిర్వహించే కాన్ఫరెన్స్‌లు, సెమినార్, వర్క్‌షాప్‌ల బ్రోచర్‌లు, రిజిస్ట్రేషన్ వెబ్‌లింక్, చెల్లింపు ఎంపికలు (క్యూఆర్ కోడ్), కమిటీ సమాచారం, ప్రోగ్రాం షెడ్యూల్, సంప్రదించాల్సిన వారి సమాచారం అన్నీ ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చన్నారు. రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-సాక్షి నెట్‌వర్క్

సొంతిల్లు కట్టుకున్నాం



పక్కా గృహం కట్టుకునే స్థోమత లేక పూరిగుడిసెలో ఉండేవాళ్లం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత ఇంటిస్థలం, పక్కా గృహం మంజూరైంది. ప్రభుత్వ సొమ్ముకు మా కష్టాన్ని తోడుచేసి సొంతిల్లు కట్టున్నాము. పేదల అభివృద్ధిని కోరుకుంటున్న జగనన్నకు కృతజ్ఞతలు.

- మల్లబోయిన పెంచలమ్మ, తిమ్మాయపాలెం, చిట్వేలి మండలం.

ఇంటి వద్దకే ధ్రువపత్రాలు



జగనన్న ప్రభుత్వంలో పలు రకాల ధ్రువపత్రాలు ఇంటి వద్దకే చేరాయి. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవాళ్లం. కానీ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఇంటి వద్దకే వచ్చి సచివాలయ సిబ్బంది అందించడం చాలా సంతోషంగా ఉంది.

- బర్కత్ అలీఖాన్, చిన్నమండెం

అమ్మఒడి ఎంతగానో ఆదుకుంది



నా భర్త చనిపోవడంతో కూలి పని చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నాను. సీఎం జగన్ సారు ఇస్తున్న అమ్మఒడి వల్ల నాకు చాలా ప్రయోజనం ఉంది. పిల్లల చదువుకు సంబంధించి ఏం కావాలన్నా వెంటనే కొనిస్తున్నాను. కూలి పనులు రోజూ ఉండవు. అందువల్ల ఒక్కోసారి కుటుంబ పోషణకు ఇబ్బంది పడే పరిస్థితులు ఉంటాయి. మాలాంటి నిరుపేదల పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా అమ్మఒడి ఎంతగానో ఆదుకుంటోంది.

- ఎస్.వాణి, గుత్తానగర్, రాజంపేట

అక్రమ మద్యం పట్టివేత



అక్రమ మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ చాంద్ బాషా, సిబ్బంది

వేంపల్లె : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వేంపల్లె సీఐ చాంద్ బాషా తెలిపారు. మంగళవారం తమకు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించామన్నారు. కుమ్మరాంపల్లె గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ఎస్.రమణ వద్ద ఉన్న 9 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కిరణ్, ఓంశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రోషన్

సింహాద్రిపురం : బలపనూరు గ్రామ సమీపంలోని రోడ్డులో చిల్లర అంగడిలో ఉన్న అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎస్.కె.రోషన్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో దాడి నిర్వహించామన్నారు. 8 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.